

బరువు మోయగలదో, లేదో? అదిమాత్రం వారికి అగోచరం. పోలీసతను వారి అనుమానాన్ని గ్రహించాడు. మెల్లిగా నవ్వుకున్నాడు.

"నేను దాటి వెళతాను. ఆ తరవాత మీరు రండి."

అతను ధైర్యంగా నడుస్తూ దాటి వెళ్లాడు. అతడి బరువును మోసిందా వంతెన. డాక్టరు, డ్రైవరు ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకుని వంతెన దాటారు.

"ఈ వంతెన పనికిరాదని ఎవ్వరు దాటరు. . . కానీ గట్టిదే. . ."

అతని మాటలకు వారి హృదయగత భావాలేలా మారాయోగాని పైకిమాత్రం మౌనం దాల్చి పోలీస్ వైపు ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

వారనుకున్నట్లు సంధ్య దాటింది. వారు ఊరు చేరారు. ముగ్గురు మంత్రిగారి బసకు వెళ్లారు.

ఇల్లంతా హడావిడిగా ఉంది. పెద్దలంతా వివాహంతో ముందుగదిలో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు.

పోలీసును చూడగానే వారిలో ఒకతను వికసించిన

నామూతో లేచి వచ్చాడు.

"తెచ్చావా, రంగా. . . ఏదీ?"

"చిత్తం, చిత్తం" అంటూ జేబులోనించి పసుపు పొట్లం తీసి ఇచ్చాడు.

దాన్ని దోసిట్లో పట్టుకుని కళ్ళకద్దుకుని లోపలికి వెళుతూ అన్నాడు: "బాబుగారికి బాగయిన వెంటనే ముందు బహుమతి నీకేరా, రంగా!"

"చిత్తం. ఆ స్వామి దయ" అంటూ కళ్ళు మూశాడు. ఏ స్వామి, దయో అతనికే తెలియాలి.

డాక్టర్‌ను గమనించినట్లే లేరు. సూర్యప్రకాశ్‌కు కోపం తారాజువ్వలా లేస్తోంది. అలిసిన ప్రాణం ఆకలితో అలమటిస్తున్నది. రోగిని చూస్తే తన బాధంతా ఎటు పోతుందో! రోగి ప్రాణాల్ని రక్షించటంలో తన శక్తినంతటిని ధారపోయగల శక్తిని పొందిన సూర్యప్రకాశ్ నిర్లక్ష్యాన్ని సహించలేకపోయాడు.

జేబులోంచి టెలిగ్రాం తీసి చూచాడు. క్రింద పేరు "శ్రీధర్" అని ఉంది.

ఆ గదిలో పరివేష్టితులైన వ్యక్తులను పరికించి చూచి, "శ్రీధర్‌గారు ఉన్నారాండీ?" అన్నాడు.

ఎవరో తలఎత్తి సూర్యప్రకాశ్ కేసి ఆశ్చర్యంగా చూచారు.

"లోపల ఉన్నారు."

అంతే. లోపలికి కబురు వెళ్ళలేదు. ఎవ్వరికీ, ఏమీ పట్టినట్లు లేదు. అందరూ దీనవదనాలతో కూచుని మెల్లిగా, బాగా మెల్లిగా ఏదో మాటాడుకుంటున్నారు.

సూర్యప్రకాశ్ వంటొక కుర్చీలో కూలబడ్డాడు. రుమాలుతో ముఖం తుడుచుకుంటూ గుమ్మంలో నుంచున్న బంట్రోతును చూచి అన్నాడు:

"ఊరినించి డాక్టర్ సూర్యప్రకాశ్‌గారు వచ్చారని చెప్పు."

ఆ పేరు విని అంతా తలలెత్తి చూచారు. మరు క్షణంలో వారి పూర్వస్థితిని పొంది గుసగుసలాడుతూ దుఃఖంలో కూర్చుండిపోయారు.

కొన్ని క్షణాలు దొర్లిపోయాయి.

నలభై సంవత్సరాల వ్యక్తి లోపలినించి వచ్చాడు. బంట్రోతు చూపడంతో అతను సూర్యప్రకాశ్ దగ్గరికి వచ్చాడు.

"మీరేనా డాక్టర్ సూర్యప్రకాశ్‌గారు? . . . మా నాన్నగారికి ఇంగ్లీషు మందులన్నా, ఆ వైద్యులన్నా నమ్మకంలేదు. ఈ ఊళ్ళో శాస్త్రులుగారిని పిలిపించాము. మా ఊరినించి హోమియోపతి డాక్టరుగారు రాబోతున్నారు. ఇప్పుడే స్వాములవారి విభూతి పట్టించాము. కొద్దిగా గుణం కనబడుతూంది. . . మీతో ఇక ఏ అవసరం లేదు." పాఠం అప్పజెప్పినట్టు గబగబా అనేసి అతను లోపలికి వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు.

"మరి నాకెందుకు టెలిగ్రాం ఇచ్చారు? అర్జంటు కేసొకటి విడిచిపెట్టి వచ్చాను. . . పోనీయండి. . . ఒక్కసారి చూస్తాను. . . ఇంతదూరం ఇంత ప్రయాసపడి వచ్చాక అంతా వృథా అయిపోవటం నా కిష్టం లేదు... అసలు వారి కేమైంది? నాటువైద్యంతో ..."

అతని మాటల కడ్డు తగులుతూ, ఆతడు చేయెత్తి వారిస్తున్నట్టు ఊపుతూ, "చూడండి. నాకు మీతో మాట్లాడటానికి సమయం లేదు. మీతో మాకు అవసరం లేదు."

ఆతడు చటుక్కున వెనుదిరిగి వెళుతూ, "శ్రీధర్‌గారూ, ఇలా వచ్చి ఈ డాక్టర్‌ను పంపించివేయండి" అన్నాడు.

సూర్యప్రకాశ్ విస్తుపోయి చూస్తూండిపోయాడు. ఏమిటీ పెడసరం జవాబు? రాత్రికి నే నెక్కడుండాలని? ఇంత దూరం వచ్చాననిగాని, ఎంతో శ్రమపడి వచ్చాననిగాని కృతజ్ఞత లేదు. పైగా, ఏదో పనికిరాని వస్తువును తీసి పారేసినట్లు ఏమిటీ ఈ ప్రవర్తన? ఛీ...ఒక్క క్షణం ఆగరాదు. వెళ్ళిపోవాలి. అతడు వెనక్కి మళ్ళబోయాడు.

"మీరే కదూ సూర్యప్రకాశ్‌గారు? నాకు తెలియక వైర్ ఇచ్చాను. మీరు ప్రసిద్ధ వైద్యులని విని టెలిగ్రాం ఇవ్వగానే అసలు విషయం తెలిసింది. అందుకని కారు పంపలేదు. మంత్రిగారికి కొద్దిగా స్వాస్థ్యం చేకూరింది. మీరు వెళ్ళిపోవచ్చు. చాలా థాంక్స్."

అతడు నమస్కరించి క్షణం ఎదురుచూడకుండానే విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

డాక్టర్ సూర్యప్రకాశ్‌కు ఓపిక నశించింది. క్రోధంతో కళ్ళు విస్ఫులింగాలయ్యాయి. పళ్ళు పటపటలాడించాడు. పిడికిళ్ళు బిగించి కళ్ళు చిట్లించాడు. ఎవరోవచ్చి అతని భుజాలమీద పిడికిలిమీద లీలగా చేయివేసి నడిపించుకునివచ్చి కుర్చీలో కూర్చుండబెట్టారు.

గదిలో నిశ్శబ్దం ప్రళయతాండవం చేస్తూంది.

ఆ గదిలో చేరినవారిలో వృద్ధుడు ఒకతను లేచి వచ్చాడు. "శాంతించండి, డాక్టర్‌గారూ. మీ రిక్కడుంటే మీకే అవమానం. మీ గురించి నేనే చెప్పాను. నన్ను క్షమించండి. మీ రిలాంటి పరిస్థితుల్లో చిక్కుకుంటారని కలలోనైనా భావించలేదు. నన్ను మన్నించండి. . . రాత్రికి మా ఇంట్లో బస చేద్దురుగాని. తిన్నగా ఇటు వెళితే ఆంజనేయులవారి గుడి వస్తుంది. దాని పక్క ఇల్లే మాది. పదండి."

అతను సూర్యప్రకాశ్‌ను బైటికి తీసుకువెళ్ళాడు. ప్రకాశ్‌కు ఏమి అడగటానికిగాని, ఆలోచించటానికిగాని మనస్కరించలేదు. ఒకవైపు ఇక్కడివారి నిర్లక్ష్యాన్ని, తిరస్కారాన్ని సహించలేక క్రోధంతో వివశుడైపోతూ తన్ను తాను మరిచిపోయే సమయంలో ఇతను ఆహ్వానించటం అతని కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అందరూ తనను తృణీకరించారన్న భావనతో, అవమాన భారంతో కుంగిపోతున్న సమయంలో ఇతను తనకు ధైర్యం చెబుతున్నట్లుగా క్షమాపణ నర్థించి ఆతిథ్యాన్ని స్వీకరించవలసినదిగా కోరుకుంటూంటే కాదనలేక మౌనంగా ఆతన్ని అనుసరించాడు.

వీథిలో ఎవర్నో కేకేశాడు. "డాక్టర్‌బాబుగార్ని మనింటి దగ్గిర దిగబెట్టు, సుబ్బుడూ. స్నానం, భోజనం అంతా చూడమని చిన్నబ్బాయికి చెప్పు ... వెళ్ళండి, డాక్టర్‌గారూ, రాత్రికి విశ్రాంతి తీసుకోండి. నేను వచ్చేవేళకి ఎంత రాత్రి అవుతుందో. . ."

అతను చుట్టూ చూచాడు. కంఠం తగ్గించి అన్నాడు: "మంత్రిగారికి చాలా సీరియస్‌గా ఉందట... ఏమిటో . . . ఆయనకు ఈ మూఢనమ్మకాలు. ఆ శాస్త్రుల్లుగారూ, ఆ సన్యాసి, ఆ హోమియోపతి డాక్టర్లు. వాళ్ళచేత కాదని నా గట్టి నమ్మకం. మీరు చూచి శస్త్రచికిత్స చేస్తే ప్రాణం నిలుస్తుందని నా నమ్మకం. . . అసలు తెలుసా మీకు? ఆయనగారికి ఏమైందో ఎవ్వరికీ తెలియదు. హృద్రోగం అంటారు. అంత రహస్యం దేనికో. . . అందరికీ తెలిస్తే



గాంధీజీ స్మారక చిహ్నం (సిమ్లా)
ఫోటో—ఎ. వి. వి. నరసింగరావు (నెల్లూరు)

పెద్ద డాక్టర్లను పిలిపించమంటారని కాబోలు! మంత్రిగారికి వాళ్ళమీద ఎంత గాఢవిశ్వాసం ఉందో! మీలాంటి వైద్యుల ప్రతిభకూడా గ్రహించలేకుండా ఉన్నారు. పోనీయండి, ఎవరి కర్మ కెవరు కర్తలు!" ఆఖరి మాటలను ఒత్తి పలుకుతూ ఆయన మెల్లగా వెనుదిరిగారు.

"మీ రెవరో నాకు తెలియదు. మీ కెంతో కృతజ్ఞతలు. . ."

సూర్యప్రకాశ్ మాటలు పూర్తికానివ్వకుండానే అత నన్నాడు.

"అంతలేసి మాట లనకండి. . . ఈ పల్లెలో మీ దగ్గిర చికిత్స పొందినవారున్నారు. మా అబ్బాయి ఒకడు. నా మాట అంటారా? నే నొక రైతును. అంతే."

సూర్యప్రకాశ్‌ను పెద్ద డాబా దగ్గరకు తీసుకు వెళ్ళాడు సుబ్బుడు. కబురందగానే ఇరవై సంవత్సరాలు దాటని అబ్బాయి బైటికి వచ్చి డాక్టర్‌ను, డ్రైవర్‌ను సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్ళాడు. వేడి నీళ్ళ స్నానం చేసి వచ్చి విశ్రాంతిగా ఈజీచైర్‌లో పడుకున్నాడు.

ఏదో అల్లరికి ఆ విశ్రాంతి భంగమైంది. కళ్ళు తెరిచి కిటికీలోంచి చూచాడు.

ఆ మసక వెలుతురులో ఎవరో గాభరాగా మాట్లాడుతున్నారు. ". . . ఇప్పుడే ఇంటికి వెళ్ళానమ్మా. దానికి పురుడు వచ్చింది. స్నానం చేసింది. ఆపకాయ లప్పం తింటాదంట. . . అమ్మగారూ, నా కేందో భయంగా ఉంది" అంటూంటే సూర్యప్రకాశ్‌కు నవ్వు వచ్చింది. ఈ జగన్నాటకంలో భర్త పాత్రధారుల్ని ఎందర్ని చూడలేదూ! ఆ క్షణాల్లో అందరికీ భయమే! సంశయమే! అంతా

బాధ! ఆవేదన!

అటువించి ఎవరిదో స్త్రీకంఠం ఓదార్పుగా ఏదో అంటూంది. సూర్యప్రకాశ్‌కు ఏవో జ్ఞాపకాలు. తనకు నలుగురు బిడ్డలున్నారు. ప్రతి ఒక్కరు పుట్టే సమయంలో తనకుకూడా ఇటువంటి బాధ, ఆందోళన కలిగేది. . . పెద్దలు ఏదో చెప్పేవారు. గది ఇవతల ఉండి "కేర్" మనేకేక కోసం అత్యంతాశతో నిరీక్షిస్తూ తన అర్ధాంగిని, బిడ్డను క్షేమంగా చూడమని ప్రార్థిస్తూ పచార్లు చేస్తున్న సమయం కళ్లలో మెదిలింది. తనలో తాను లీలామాత్రంగా నవ్వుకున్నాడు. ఆ జ్ఞాపకాలు మధురానుభవాలు కాక మరేమిటి?

తన ధ్యానం భంగమైనట్లు చటుక్కున లేచి కూర్చున్నాడు. వీథిలోంచి ఎవరిదో స్త్రీకంఠం. "ఒరేయ్ సిద్దన్నా, జల్దీగా రారా. అది సావుబతుకుల్లో ఉంది. నీ ఆవకాయా నువ్వూ పాడుగానూ." ఆ కంఠం దూరమైంది. అంటే ఆ వ్యక్తి మాట్లాడుతూనే వెళ్లిపోయిందన్నమాట.

మరుక్షణంలో ఆ అబ్బాయి వేడివేడి పాలు తీసుకువచ్చాడు. డాక్టర్లు సహజమైన ఉత్సుకతకొద్దీ జరిగిన సంఘటనను గూర్చి ప్రశ్నించాడు. ఆ అబ్బాయి విశదీకరించాడు.

"సిద్దన్న మా ఊరి వడ్రంగి. చాలా మంచివాడు. ఉన్నదానితో తృప్తిగా కాలం వెళ్లబుచ్చే పుణ్యదంపతులు వాళ్లు. కానీ వాళ్లకు ఒక్కటే కొరత. ముగ్గురు కొడుకులు పుట్టి పురిటిలోనే పోయారు. పూజలు, పునస్కారాలు, ఉపవాసాలకు అంతు లేదు. ఉన్నదానిలో దానధర్మాలు చేశారు. కానీ భగవదనుగ్రహం కలగ లేదు. తినమని ఇచ్చిన ఫలాన్ని బలవంతంగా లాగేసుకున్నట్లుంది. ప్రతిసారి ఇలాగే అవుతూంది. పిల్లలు లేకపోయినా ఫరవాలేదుగానీ ఈ బాధ భరించలేనని ఆమె వాపోని క్షణం లేదు."

సూర్యప్రకాశ్ శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"నీ పేరేమిటబ్బాయ్?" అన్నాడు గబుక్కున.

ఆ అబ్బాయి విస్తుపోయి చూస్తూ, "వెంకోబరావు" అన్నాడు.

"చూడబ్బాయ్! వాళ్లింటికి వెళదామా?"

ఆత్రంగా చూస్తున్నాడు. వెంకోబరావుకు ఏ జవాబు చెప్పటానికి తోచలేదు. ఇదెంత నిస్సారమైన కోరికో వారిద్దరికీ తెలుసు. ఆ పల్లెలో మామూలు జబ్బులకే మగడాక్టర్లకు చూపించే అలవాటు లేనప్పుడు ప్రసవ సమయంలో ఒక డాక్టరు చూస్తాననటమే మహా పాపం. ఇక కాన్పు చేస్తే లోకం ఏమంటుంది? స్త్రీ తన ప్రాణాలనైనా కోల్పోగలదు గాని ఈ పరిస్థితికి లొంగిపోదు.

"ఇల్లు చూపిస్తానుగానీ. . ." ఆ పిల్లవాడు సంశయిస్తూ మౌనం దాల్చాడు.

"ఆ. . . ఇల్లు చూపిస్తే చాలు. ఆ తరవాత నేను చూసుకుంటాను. . . పద. . ."

"మీరు అలిసిపోయారు . . . భోజనం. . ."

డాక్టర్ అప్పుడే లేచి తడిజుత్తును దువ్వుకుంటూ అన్నాడు: "నాకు ఆకలిగా లేదు. . . మళ్లీ భోంచేయవచ్చు. . . పద, బాబూ."

డాక్టర్‌ను ఆపలేనని తెలుసుకున్నాడు వెంకోబరావు. మౌనంగా మార్గం చూపించాడు.


నాలుగైదు వీథులు దాటారు. మామూలైన పెంకుటిల్లు దగ్గిర ఆగారు. అప్పటికే ఇరుగుపొరుగు వారు చేరారు. లోపలినించి సన్నని మూలుగు వినవస్తోంది. గుమ్మందగ్గిర ముక్కాలిపీటమీద కూర్చున్న సిద్దప్ప వీళ్లను చూచి లేచి వచ్చాడు. వీళ్లెందుకు వచ్చారో అంతు పట్టలేదతనికి. స్త్రీలందరు పక్కకు తప్పుకుని నుంచున్నారు.

"సిద్దప్పా, మంత్రిగారిని చూడటానికి డాక్టరుగారు వచ్చారు. . ." వెంకోబరావుకు ఆ తరవాత ఏమి ఎలా చెప్పాలో తోచక మౌనం దాల్చి మిట్కా కలియజూస్తూ నుంచున్నాడు.

"చూడు, సిద్దప్పా, కడపనించి ఎప్పుడో బయలుదేరాను. రోడ్డు గండి పడింది. నడిచి వస్తూంటే ఏరు అడ్డు తగిలింది. ఎవరో పోలీసు వచ్చి వంతెన ఒకటుందని రెండు మైళ్ళు నడిపించి చివరకు వంతెన చూపాడు. దాటాను. వచ్చాను. బయలుదేరకముందు తిన్న తిండి. అలవాటు లేని నడకతో అలిసిపోయి వస్తే ఇక్కడ నా అవసరం ఏమీ లేకపోయింది. నా శ్రమ వృథా అయింది. అక్కడ కడుపులో వ్రణమైన రోగిని వదిలి పరుగుమీద వచ్చాను. అక్కడ అతనికిగాని, ఇక్కడ మంత్రికిగాని చికిత్స చేయలేకపోయాను. అయితే నా శ్రమ వృథా కావలసిందేనా? భగవంతుడే మీకోసం నన్ను ఇక్కడికి రప్పించాడేమో. మీ కోరికను సిద్ధింపజేయాలని నన్ను పంపాడేమో! నేను భక్తుణ్ణి కాను. నాలో విపరీత శక్తులేమీ లేవు. కాని నాకు చేతనైన సాయం చేస్తాను. ఆ తరవాత ఆ పరమేశ్వరుడే ఉన్నాడు. ఈ విషయంలో నా కెంతో ధైర్యంగా ఉంది. నేను మరో పనిమీద ఇక్కడికి రాలేదని, మీ పనిమీదనే భగవంతుడు పంపాడనీ గట్టి నమ్మకం నాలో కలిగింది. నువ్వు అన్యథా భావించకు. నీలో భయం నాకు తెలుసు. నీకు కావలసింది ఏమిటో నాకు తెలుసు. దాని ముందు నీ భయాన్ని బలిచేయరాదా, సిద్దన్నా! దీనివల్ల నాకు వచ్చేది ఏమీ లేదు. ఆ భగవంతుని ఆజ్ఞను నెరవేర్చిన తృప్తిమాత్రం నాలో మిగిలిపోతుంది."

సిద్దన్న గుడ్లప్పగించి చూస్తున్నాడు. పిచ్చి


గీరుకోకండి!
అన్ని చర్మవ్యాధులకు వాడండి.
ఎగ్జిమా, రింగ్‌వోమ్, స్కేబీస్ మున్నగు చర్మ వ్యాధుల నుండి మీకు త్వరగా, నిరపాయంగా, పూర్తి నివారణము లభించును.
అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్


తయారుచేయువారు: అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు-4.


చెమ్మగిల్లాయి. పెదాలు సన్నగా కంపిస్తున్నాయి. ఏమీ మాట్లాడలేకపోయాడు.

సూర్యప్రకాశ్ అక్కడే అరుగుమీద కూచున్నాడు "మంత్రసాని ఎవరైనా వచ్చారా?"

"చిత్తం. గంగమ్మా" అని కేకేశాడు.

గంగమ్మ బైటకి వచ్చింది. డాక్టర్‌ను చూడగానే ముఖం విచ్చింది.

"డాక్టర్ అయ్యగారు పిలుస్తున్నారు."

ఆమె బాగా ముందుకు వచ్చింది.

సూర్యప్రకాశ్ అడగవలసిన ప్రశ్నలు గబగబా అడిగాడు. ఆమె అయిష్టంగానే సమాధానం ఇస్తూ ఆఖరు ప్రశ్నకు జవాబుగా అంది. "ఎదురుకాళ్లతో పుడుతుంది బిడ్డ."

లోపలనించి బిగ్గరగా అరుపులు వినిపించాయి. గంగమ్మతోపాటు మరిద్దరు ఆడవాళ్లు లోపలికి పరిగెత్తారు.

సూర్యప్రకాశ్ గబగబా కిట్ తెరిచి చేతులకు గ్లౌస్ వేసుకున్నాడు. ఏదో మందు చేతుల్లో వేసుకొని రుద్దుకుంటూ లోపలికివెళుతూ, "సిద్దన్నా, నువు, గుమ్మందగ్గర నుంచుందువుగాని" అన్నాడు.

సిద్దన్న మంత్రముగ్ధునివలె అతనిని అనుసరించాడు. ఎవ్వరు అతనిని వారించలేకపోయారు.

కడుపులో బిడ్డ నాడి సరిలేదు. తల్లికి నాలుగైదు ఇంజక్షన్‌లు ఇచ్చాడు. ఎదురుకాళ్లవటంచేత బిడ్డ కొనప్రాణాలతో పుట్టాడు. ఆ పసికందుకు మూడు ఇంజక్షన్‌లు ఇచ్చి, కాళ్లు పైకెత్తి కొడుతూంటే అక్కడ చేరిన ఆడవాళ్లు ముక్కుమీద వేలేసుకుని చూస్తున్నారు. ఆ మగబిడ్డ ప్రాణం ఎక్కడినుంచో ఎగిరి వచ్చినట్లు కేర్‌మంటూ సన్నగా ఏడ్చాడు

ఆ బిడ్డను ఇంకా బాగా ఏడ్చేలా చేశాడు ఏడుస్తున్న బిడ్డను అడ్డంగా చేతుల్లో ఎత్తుకుని గుమ్మందగ్గరికి వెళ్లి అన్నాడు:

"సిద్దన్నా, విన్నావా ఎంత గడుసుగా ఏడుస్తున్నాడో!"

ఆ వైపునుంచి ఏమి జవాబు వచ్చిందోగాని అతను వినలేదు.

బిడ్డను గంగమ్మకు అందిచ్చి, తల్లి నాడి పరీక్షచేసి బైటకి వచ్చాడు.

సరిగ్గా పదిన్నర దాటింది.

సిద్దన్న ఆరాధనాపూర్వకంగా డాక్టర్‌వైపు చూచాడు అతని నుదుటిపైన సన్నగా మెరుస్తున్న స్వేద బిందువులు, ముఖంలో స్పష్టమైన అలసట, అవ్యక్తమైన ఆందోళనతో కళావిహీనమయిన కనుదోయిలో, ఎర్రజీర, చెదరిన జుత్తులో ప్రస్ఫుటంగా ద్యోతకమౌతున్న తెల్ల వెంట్రుకలు. నడకలో, చేతలలో నవ్వగిల్లే ఉత్సాహంతో ఓలాపడి అరుగుమీద చతికిలబడిన డాక్టరు కాళ్లదగ్గిర ఉన్న మెట్టుమీద సిద్దన్న నెమ్మదిగా కూర్చుని చేతులు కట్టుకుని అతని నోటినించి ఏమి మాటలు, ఏమి ఆజ్ఞ వెలువడుతుందోనని ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు.

"సిద్దన్నా, గండం గడిచిందని మనం ఏమరుపాటుతో ఉంటే లాభం లేదు. మందులు తెప్పించాలి. వెంటనే ఎవరినైనా పంపు. . . నా దగ్గిర ఉన్నవాటికంటే మంచివి కావాలి. ఈ రాత్రికి ఇక్కడే ఉంటాను."

ఆఘున కాగితంమీద ఏవో మందులు రాసిస్తూ అన్నాడు:

"చేతిలో డబ్బుందా? కనీసం ఏభై రూపాయలన్నా ఉండాలి."

"తమరి దయ. ఉందయ్యా . . . ఇప్పుడే పంపిస్తాను." మాటలు తడబడుతూంటే గబగబా వెళ్లిపోయాడు.

గోడకు తల ఆన్చి దీర్ఘంగా విశ్వసించాడు. దాంతో తాను ఆనాడు కొద్ది గంటలు—కాదు కాదు—ఆ పన్నెండు గంటలు పడిన ఆందోళన అంతా ఎగిరిపోయింది. హృదయం ప్రశాంతమైంది. ఎనలేని తృప్తి ఆవరించింది. తను వచ్చిన పని సఫలమైందనే అనుకోవాలి. కళ్లు మూసుకుని భగవంతుని మార్గాలను, ఆతని లీలలను ధ్యానిస్తూ అచ్చెరువొందుతూ కూర్చున్నాడు.

"అయ్యా, స్నానం జేయండి. అలిసిపోయినారు." సిద్దన్న వినయంగా అన్నాడు.

"కొడుకును చూశావా? తల్లి బాగుందా?"

"చిత్తం. . . తమరి దయ. . ."

"అట్లా అనకు, సిద్దన్నా. ఇదంతా ఆయన మాయ." డాక్టరు చేతులు రెండు పైకెత్తి జోడించాడు.

సిద్దన అతన్ని అనుసరించాడు.

అతను స్నానం ముగించుకుని రాగానే ఆరుబయట మంచం వేసి తెల్లటి దుప్పటి పరిచాడు. తల తుడుచుకుంటూ ఆ మంచంమీద విశ్రాంతిగా కూర్చున్నాడు సూర్యప్రకాశ్.

సిద్దన్న తటపటాయిస్తూ చేతులు నులుముకుంటూ పక్కగా నుంచున్నాడు.

"తమరి . . . భోజనం?. . ."

"ఆ వెంకోబరావు టిఫిన్ తెస్తాడుట. తిని ఇక్కడే పడుకుంటాను. అవసరమైతే నేను దగ్గిరలో ఉండటం మంచిది."

మరికాసేపటికి వెంకోబరావు టిఫిన్ కేరేజి పట్టించుకువచ్చాడు. కడుపు నిండా భోజనం చేసి వక్కపొడి నములుతూ మంచంమీద మేను వాల్చాడు సూర్యప్రకాశ్.

ఎవరో కబురు చేరవేశారు. సిద్దన్న ముక్కాలిపీట మీద వేడివేడి పాలగ్లాసు పెడుతూ నెమ్మదిగా చెప్పాడు: "అయ్యా, మంత్రిగారు పోయారట."

సూర్యప్రకాశ్ ఆశ్చర్యపోలేదు. ఏమీ పలకలేదు. వినన్నట్టే మౌనం దాల్చాడుగానీ అతని హృదయంలో భావాలు అతి వేగంగా పయనిస్తున్నాయి.

'ఔను. నేను మంత్రిగారికోసం రాలేదు. అతనికి ఈనాడు ఆయుస్సు తీరాలని ఉంది. ఈ దంపతుల కోసమే నేను వచ్చాను. ఆ బిడ్డ నిండుప్రాణాల్ని రక్షించటానికే వచ్చాను.'

సన్నటి వెన్నెల జల్లులో, సాంబ్రాణి ధూప గంధ సమ్మిళితమైన వాతపోతము మేను సోకి మైమరపింపజేస్తూంటే, తాను వచ్చిన పని నెరవేరిందన్న భావన హృదయంలో వ్యాపించి తృప్తిని ప్రసాదిస్తూంటే ప్రశాంతంగా నిద్రపోయాడు.

భళ్లున తెల్లవారింది.

సూర్యప్రకాశ్ తిరుగుప్రయాణమయ్యాడు. సిద్దన్న కృతజ్ఞతతో తనకు తోచినంత డబ్బు ఇవ్వబోయాడుగాని అతను ఒప్పుకోలేదు. పిల్లవాడిని పరీక్షించి ధైర్యం చెప్పి వెళ్లిపోవటాని కుద్యుక్తుడయ్యాడు.

వెంకోబరావు బండి కట్టించుకువచ్చాడు.

అప్పటికికాని తమ కారు సంగతి గుర్తుకు వచ్చింది కాదు!

ఆ బండిలో ఎక్కినవాళ్లలో ఆ పోలీసుకూడా ఉన్నాడు. ఊరి పొలిమేరలు దాటేవరకు సిద్దన్న కూడా వెళ్లాడు.

బండి వంతెనదగ్గిర ఆగింది. ముగ్గురు వంతెన దాటారు. నడక ప్రారంభించారు. కారు చెక్కుచెదరకుండా ఉంది. అంతేకాదు, ఎవరో దాన్ని రిపేరు చేస్తున్నారు.

సూర్యప్రకాశ్ ఆశ్చర్యంతో పోలీసువైపు చూచాడు. అతడు చిన్నగా నవ్వుతూ అన్నాడు:

"ఈ ఊరు మాదేలెండి. మీకు అవసరం వస్తుందని మా తమ్ముడికి రిపేరు చేయమని చెప్పాను. వాడే కాపలా కాశాడు . . . తమరికి నేను తెలీదులెండి. చిన్నప్పుడు ... అంటే నాకు పదహారేళ్లప్పుడు విష జ్వరంతో ఉంటే బాగుచేశారు. . . అంతేకాదయ్యా. డబ్బు సాయంకూడా జేశారు. మా అమ్మ ఎప్పుడు మిమ్మల్ని తలుస్తుంది. ముప్పూటలా అన్నం తింటున్నామంటే అది తమరి దయే. . . చంద్రనగరంలో మీరు వస్తున్నట్లు చెప్పారు. . . ఇంగిలీసు మందుల మీద నమ్మకం లేదనికూడా చెప్పారు. . . సరే. . . నన్ను పంపారు. . ."

పోలీసు డ్రైవర్ దెస అనుమానంగా చూచాడు. నడక వేగం తగ్గించాడు. డ్రైవర్‌ను కాస్త ముందుగా పోనిచ్చి మెల్లగా అన్నాడు: "పెరటి చెట్టు మందుకు

> దేవునివైపు వేసే ఒక ముందడుగే ఒక సత్కార్యం.
>
> —జె. జి. హాలండ్

పనికిరాదంట. దేవుడులాంటి మిమ్మల్ని లెక్కచేయరని తెలుసుకున్నాను. మా తమ్ముడు డ్రైవర్‌లెండి. మిలిటరీలో ఉన్నాడు. సెలవలకు వచ్చాడు ... బాబూ, ఒక్క మాట ... ఎవ్వరితో అనకండి. . . నామీద ఒట్టే. . . ఆ విభూతి చూచారూ. . . అది ఏ సన్యాసి ఇవ్వలేదు. ఆ పల్లెకు పోలేము. బురద, నీరు, పాములు, తేళ్లు. . . అలాంటిచోటికి పోటానికే భయం. వరదలుకదా, ఎక్కడున్నాడో ఆ సన్యాసి. . ."

పోలీసు గబుక్కున ఆపుజేశాడు. దూరంగా ఎవరో ముసలమ్మ వారివైపు నడిచి వస్తోంది.

"ఆ ముసలిదే మా అమ్మ. మీకోసం వస్తోంది."

సూర్యప్రకాశ్ విస్తుపోయి చూస్తున్నాడు. ఆ ముసలమ్మ సమీపించింది. వణుకుతున్న కంఠంతో సూర్యప్రకాశ్‌ను దీవించింది. ఆమె జీర్ణవదనంపై కన్నీరు కారుతూంటే చూచి అతడు చలించిపోయాడు.

వెనక పదేళ్ల కుర్రాడు బుట్టతో కూరగాయలు పట్టుకునిఉన్నాడు. అవి తనకు కానుకలు!

సూర్యప్రకాశ్ వారందరివైపు కృతజ్ఞతతో చూచాడు. ఎన్నో సంవత్సరాలుగా ఎప్పుడూ కలగని సంతృప్తి అతనికి కలిగింది. ఆ పరమాత్ముని చేతలు ఎంతటి వింతలు!

**[డాక్టర్ మేయో (ఆఫ్ మేయో క్లినిక్) జీవితచరిత్రలోని ఒక సంఘటన చదివిన తరవాత వ్రాసినది.]**